సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 22 । జూన్ । 2023


పాము బాబోయ్...!
ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యే వేళ పాములు బుసకొడుతున్నాయి. పొరపాటున కాలు పడితే కాటు వేస్తున్నాయి. - 8లో


పైడితల్లి ఆలయ అభివృద్ధికి కృషి
ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మ వారి ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని ఆలయ ధర్మకర్తల మండలి నిర్ణయించింది. - 8లో


శతశాతం హాజరయ్యేలా...
ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థి స్కూల్‌కు ప్రతిరోజూ వచ్చేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని డీఈఓ జి.లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

రాష్ట్రపతిని కలవడం ఆనందంగా ఉంది


రాష్ట్రపతిని కలిసిన వారితో పీఓ కల్పనాకుమారి

సీతంపేట: రాష్ట్రపతితో భేటీకావడం ఆనందంగా ఉందని సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు పీఓ కల్పనాకుమారికి తెలిపారు. పీఓను ఆమె చాంబర్‌లో బుధవారం కలిశారు. ఐటీడీఏ పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పర్యాటక ప్రదేశాలు, గిరిజనుల జీవన విధానం తదితర అంశాలను రాష్ట్రపతికి తెలియజేశామన్నారు. ఢిల్లీలో ముఖ్య భవనాలను, ప్రముఖ ప్రాంతాలను చూపించారన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, డీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు యువజనోత్సవాలు

● నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి


కె.వెంకట్‌ఉజ్వల్

పార్వతీపురం టౌన్: జిల్లాలో యువజనోత్సవాలను నేడు (గురువారం) నిర్వహిస్తామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ ఓ ప్రకటనలో తెలిపారు. యువతలో ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం, ఎస్.వి.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పార్వతీపురం అడ్డాపుశీల ఎస్‌వీడీ డిగ్రీ కళాశాలలో 'భారతదేశం 2047' అనే థీమ్‌తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక, జానపద కళలు వంటి అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆయా విభాగాల్లోని విజేతలకు నగదు బహుమతితో పాటు ధ్రువపత్రాలు అందజేస్తామని, ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి యువ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. యువ ఉత్సవ్ పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు పార్వతీపురం మన్యం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయం, లేదంటే సెల్: 7386325310 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

35 మందికి ఉద్యోగాలు


జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఆర్ఐటిఐ)లో ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 35 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ తెలిపారు. జాబ్‌మేళాకు 73 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా, హైదరాబాద్‌కు చెందిన ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించి 35 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు విధుల్లో చేరి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

జూలై 1 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్న సురక్ష శిబిరాలను జూలై 1 నుంచి మండల స్థాయిలో నిర్వహించాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్య ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో బుధవారం మాట్లాడారు. మండల స్థాయిలో శిబిరాలను నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను జారీచేస్తామన్నారు. ఈ నెల 24 నుంచి వలంటీర్లు ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష సేవల వివరాలు తెలియజేయాలన్నారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంపై ఇప్పటికే మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, డుమా పీడీ కె.రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య యోగం




యోగాసనాల సాధనలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

- శారీరక, మానసిక ఒత్తిడి దూరం
- పార్వతీపురంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగాసనాలు వేసిన ఉద్యోగులు, యువత, ఉపాధి హామీ వేతనదారులు

పార్వతీపురంటౌన్:

యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, శారీరక, మానసిక ఒత్తిడి దూరమవుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పార్వతీపురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు, లయన్స్‌క్లబ్, యోగా శిక్షణ కేంద్రాల సౌజన్యంలో నిర్వహించిన యోగా దినోత్సవాన్ని జేసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో ప్రతీ రంగంలోనూ తీవ్ర పోటీ నెలకొనడంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. శారీరక శ్రమ తగ్గిందని, అందువల్ల చిన్నవయసులోనే ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు గురవుతున్నారన్నారు. మానసిక ప్రశాంతతకు, శారీరక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందన్నారు. భారతీయ వారసత్వ సంపదగా వస్తున్న యోగాను ఏటా జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సూర్య యోగా కేంద్రం సభ్యులు యోగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరి, దిశ డీఎస్పీ హర్షిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు, డీఐపీఆర్‌ఓ ఎల్.రమేష్, ఆయుష్ నోడల్ అధికారి డా.టి.హేమాక్షి, హోమియో డాక్టర్ బి.సుశీల, లయన్స్ క్లబ్ చైర్మన్ రాజేశ్వరరావు, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, యూనియన్ బ్యాంకు మేనేజర్లు రామకృష్ణ, అనస్ గుప్తా, ఓం శాంతి ప్రతినిధి పి.కె.జ్ఞానరత్నం, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిన్నారుల యోగా ప్రదర్శన


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

జీవన విధానంలో యోగా ఓ భాగం


యోగా సాధనలో రెండవ అదనపు జిల్లా జడ్జి ధామోదరరావు, ఉద్యోగులు, న్యాయవాదులు

ప్రపంచంలోని ప్రజలందరి ఆరోగ్య మంత్రమైన యోగా మన భారతీదేశ ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమేనని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ధామోదరరావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం జరిగిన ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగసాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. నేటి సమాజంలోని అన్నిరంగాల్లో ఉన్న మానసిక ఒత్తుడులను ఎదుర్కొంటున్నారని, అందుకే యోగా సాధన ద్వారా ప్రశాంత జీవనానికి నాంది పలకవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎ.రమేష్, అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ డిసౌజన్య, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త నిర్వహణలో

25న గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి నగదు, స్టడీ మెటీరియల్ అందజేత

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు వెయ్యి పోస్టుల వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'సాక్షి ఎడ్యుకేషన్.కాం' రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సీ.ఎగ్జామ్స్ కలిసి ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తోంది. పట్టణంలోని మూడులాంతర్ల జంక్షన్ సమీపాన హోటల్ ఆనంద్ గ్రేండ్ ఫోర్ట్ లో ఈ నెల 25వ తేదీ ఉదయం 9.00 గంటల నుంచి 12.30 వరకు ఈ సదస్సును చేపడుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు 'సాక్షి ఎడ్యుకేషన్.కాం' తోడుగా ఉంటున్న విషయం తెలిసిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్–2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం ... దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా సెల్: 89850 94499 నంబర్‌కు తమపేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

ఉచిత అవగాహన సదస్సు తేదీ:
ఈ నెల 25

వేదిక:
హోటల్ ఆనంద్ గ్రాండ్ ఫోర్ట్, ఏ.జి.రోడ్, మూడు లాంతర్ల జంక్షన్, విజయనగరం

సమయం:
ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నంబర్: 89850 94499

జాతీయ వర్క్‌షాప్‌లో చంద్రశేఖర్


జాతీయ వర్క్‌షాప్‌లో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌లో ఫిజిక్స్ పాఠ్యాంశాలను బోధిస్తున్న అధ్యాపకుడు చంద్రశేఖర్‌రావు

విజయనగరం అర్బన్: ఆగ్రాలోని ఆనంద్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు 'ఇన్నోవేటివ్ టీచింగ్ ఇన్ ఫిజిక్స్' అనే అంశం జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జోగ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానం ఆధారంగా స్కిల్‌బేస్డ్ పాఠ్యాంశ బోధనపై పవర్ పాయింట్ ప్రదర్శన ఇచ్చారు. భౌతిక శాస్త్రంలో క్లిష్ట అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు సులభంగా బోధించడంపై చిన్నచిన్న ప్రయోగాల రూపంలో వివరించినట్లు చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఐటీ కాన్పూర్ శిక్షా సోపాన్, నేషనల్ అన్వేశిక నెట్వర్క్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సదస్సుకు అన్ని రాష్ట్రాల నుంచి 32 మందిని ఎంపిక చేశారన్నారు. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరయిన ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మశ్రీ హెచ్‌సీ వర్మ నుంచి ప్రశంసలు లభించాయన్నారు.

పైరవీలకు చెక్

- పారదర్శకంగా కేజీబీవీల్లో కాంట్రాక్టు టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియ
- వైబ్‌సైట్‌లో మెరిట్ జాబితా
- కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన
- నెలాఖరులోగా స్కిల్ టెస్టు నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు సన్నాహాలు


వీరఘట్టం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం

వీరఘట్టం: ఉద్యోగ నియామకాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. అర్హతే కొలమానంగా అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తోంది. తాజాగా కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో అర్హులతో భర్తీచేసే ప్రక్రియను చురుగ్గా నిర్వహిస్తోంది. మెరిట్ జాబితాను ఎంపిక చేసి కేజీబీవీ వెబ్‌సైట్‌లో ఉంచింది. కేజీబీవీలలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 150 పోస్టులకు 4,602 మంది మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేయగా, ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న 124 పోస్టులకు 3,571 మంది దరఖాస్తు చేశారు. వీరిలో అర్హులైన అభ్యర్థులను 1:3 రోస్టర్ పద్ధతిలో ఎంపిక చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 406 మంది, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 320 మందితో కూడిన మెరిట్ జాబితాను సమగ్ర శిక్ష అధికారులు కేజీబీవీ వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

మెరిట్ జాబితాలోని అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. గురువారం కూడా కొనసాగనుంది. అనంతరం కలెక్టర్ల ఆధ్వర్యంలో అభ్యర్థులకు స్కిల్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఈ నెలాఖరుకు పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

ఆర్ఓఎఫ్ఆర్ లబ్ధిదారులకు
150 పనిదినాలు


ఆర్ఓఎఫ్ఆర్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్న గిరిజన లబ్ధిదారులకు ఉపాధిహామీ పథకంలో 150 పనిదినాలు కల్పించనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి తెలిపారు. మండలంలోని మర్రిపాడు గ్రామంలో వేతనదారులతో బుధవారం సమావేశమయ్యారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి వేతనదారునికి ఉపాధిహామీ పని కల్పిస్తామన్నారు. గ్రామంలో సుమారు 200ల మందికి 150 పనిదినాలు కల్పించేలా రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీహరి పాల్గొన్నారు.

త్వరితగతిన రోడ్డు పనులు


రొడ్డవలస నుంచి కంకణపల్లి వరకు చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పాచిపెంట: త్వరితగతిన రోడ్డు పనులు పూర్తిచేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం నిధులతో పాచిపెంట మండలంలోని ఆజూరు–పందిరి మామిడివలస, రొడ్డవలస–కంకణపల్లి, సాలూరు మండలంలో జాతీయ రహదారి–26 నుంచి కరడవలస వరకు చేపడుతున్న బీటీ రోడ్ల పనులను బుధవారం పరిశీలించారు. పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నిర్మాణాలకు అటవీ అనుమతులు లభించిన నేపథ్యంతో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. కల్వర్టుల నిర్మాణాలకు అనుకూల సమయమని, పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనుల సమయంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట సాలూరు తహసీల్దార్ బాలమురళి, పంచాయతీరాజ్ డీఈ వి.శర్మ, ఏఈలు బి.శంకరరావు, వరలక్ష్మి ఉన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె..

- డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు 24 తుదిగడువు
- వచ్చేనెల 4 నుంచి తరగతుల నిర్వహణ
- ఈ ఏడాది నుంచి నూతన విధానం
- మూడేళ్లకు బదులు నాలుగేళ్లు కోర్సులు
- ప్రభుత్వ కళాశాలలకు పెరుగుతున్న ఆదరణ
- జిల్లాలో 6 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 1780 సీట్ల భర్తీకి చర్యలు


ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పార్వతీపురం

పార్వతీపురం టౌన్:

రాష్ట్ర ప్రభుత్వం 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా ఆన్‌లైన్ విధానంలోనే డిగ్రీ అడ్మిషన్లు చేపట్టనున్నారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. మొత్తం ఆరు ప్రభుత్వ, 10 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సుమారు 1780 సీట్ల భర్తీ చేయనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ సాధారణ కోర్సులతో పాటు, కంప్యూటర్, మార్కెట్ ఓరియెంటెడ్, స్కిల్ ఓరియెంటె డ్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విద్యార్థులు ఏపీఎస్‌సీ హెచ్‌ఈ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం దగ్గర్లోని డిగ్రీ కళాశాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సాధారణ కోర్సులకు రూ.3 వేల వరకు, కంప్యూటర్ కోర్సులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఫీజు ఉంటుంది. ఫీజుల భారం పేద విద్యార్థుల కుటుంబాలపై పడకుండా, రాష్ట్ర ప్రభుత్వమే జగనన్న విద్యా దీవెన ద్వారా ఆయా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేస్తుంది. ఆ మొత్తాలను ఆయా విద్యార్థులు కళాశాలల్లో చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలో డిగ్రీ కళాశాల సీట్ల వివరాలు ఇలా..	
డిగ్రీ కళాశాల	సీట్ల సంఖ్య
పార్వతీపురం ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల	360
సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల	340
గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల	280
పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల	300
సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల	350
వీరఘట్టం ప్రభుత్వ డిగ్రీ కళాశాల	150

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా...

ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకూ విద్యార్థులు ఆన్‌లైన్ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 21 నుంచి 23వ తేదీ వరకూ ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్/సీఏపీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్/ఎన్సీసీ/గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్లు ఉంటాయి. వీటిని ఆయా యూనివర్సిటీల్లో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు. కోర్సుల ఎంపికకు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. వచ్చే నెల 3న సీట్లు కేటాయించి, అలాట్ అయిన విద్యార్థులకు ఎంపికైన కళాశాలల్లో 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

ఈ ఏడాది నుంచి సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సు


జాతీయ విద్యా విధానం–2020 నిబంధనలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెట్టింది. సంప్రదాయక మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు అమలు చేస్తున్నారు. వీటిలో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా, ఒక్కటే మేజర్ సబ్జెక్టు ఉంటుంది. దీనిని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. గతంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ చదువుకునే విద్యార్థి.. సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో ఈ మూడింటిలో ఏదో ఒకటి మేజర్ సబ్జెక్టుగా ఎంచుకోవాలి. నచ్చిన మరొకటి మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవాలి. ఇంటర్లో ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో సంబంధం లేకుండా ఏ సబ్జెక్టునైనా మైనర్ సబ్జెక్టుగా ఎన్నుకోవచ్చు. నాలుగేళ్లలో మధ్యలో ఎప్పుడైనా చదువు మానేసే వెసులుబాటు విద్యార్థికి ఉంటుంది. ఫస్టియర్ చదివి మానేస్తే సర్టిఫికెట్ కోర్సుగా సర్టిఫికెట్ ఇస్తారు. రెండేళ్లయితే డిప్లొమా, మూడేళ్లయితే డిగ్రీ, నాలుగేళ్లు చదివితే డిగ్రీ ఆనర్స్ సర్టిఫికెట్లు అందిస్తారు. ఫస్టియర్ నుంచి నాలుగేళ్ల లోపు ఏ దశలో చదువు మానేసినా, తిరిగి ఏడేళ్ల లోపు ప్రవేశం పొంది, విద్యాభ్యాసం కొనసాగించే అవకాశం ఉంది. ఈ నూతన విధానంపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంది.


సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సీట్ల కేటాయింపు ఇలా..

గతంలో డిగ్రీ అడ్మిషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించే వారు కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డిగ్రీ కోర్సులలో 50 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేసింది. ఇంటర్మీడియెట్ కామర్స్ ఒక సబ్జెక్టుగా చదివిన వారికి మొత్తం బీకాం సీట్లలో 60 శాతం కేటాయిస్తారు. అలాగే ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారికి మొత్తం బీఏ సీట్లలో 50 శాతం కేటాయిస్తారు. మిగిలిన 50 శాతం ఇంటర్మీడియట్‌లో సైన్స్ గ్రూపులు చదివిన వారికి కేటాయిస్తారు.

అన్ని రకాల సౌకర్యాలతో..



డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. దీనిని ఇంటర్మీయట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తక్కువ ఫీజులతో, అన్ని రకాల సౌకర్యాలతో డిగ్రీ చదువుకునే వెసులబాటును ప్రభుత్వం కల్పిస్తోంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోంది. క్యాంపస్ ప్లేస్మెంట్లలో అత్యధిక మంది విద్యార్థులు ఎంపికవుతున్నారు.

– డాక్టర్ చలపతిరావు, ప్రిన్సిపల్, ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పార్వతీపురం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు పథకం కింద డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూరాయి. అత్యున్నత ప్రమాణాలతో డిగ్రీ కళాశాలల్లో బోధన జరుగుతోంది. అన్ని కళాశాలల్లోనూ జవహర్ నాలెడ్జ్ సెంటర్లు, ప్లేస్‌మెంట్ సెల్స్ ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– టి.రాధాకృష్ణ, ప్రిన్సిపల్, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాలూరు

క్లుప్తంగా

పట్టాలు తప్పిన గూడ్స్



పట్టాలు తప్పిన ఖాళీ గూడ్స్

విజయనగరం టౌన్: విజయనగరం రైల్వేస్టేషన్‌లోకి వస్తున్న గూడ్స్ బుధవారం పట్టాలు తప్పింది. విజయనగరం నుంచి పలాస వెళ్లేందుకు రూట్ నంబర్ తొమ్మిదిలో ఖాళీ గూడ్స్ బయలుదేరింది. ట్రాక్ మారుతున్న సమయంలో కిలోమీటర్ నంబర్ 817/37 ట్రాక్ వద్ద చక్రం పట్టా తప్పింది. డ్రైవర్ గుర్తించి వెంటనే బండిని నిలిపివేసి, అధికారులకు సమాచారమందించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు విశాఖ నుంచి ప్రత్యేక క్రేన్‌ను తెప్పించి కేవలం గంట వ్యవధిలోనే సమస్యను పరిష్కరించారు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

ఇరిగేషన్ ఉద్యోగుల సహకార సంఘ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేస్తున్న సభ్యులు

బొబ్బిలి: విశాఖ, విజయనగరం, ర్వతీపురం మన్యం జిల్లాల ఇరిగేషన్ ఉద్యోగుల సహకార సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఈ ఎన్నికకు అధికారిగా చల్లా పద్మజ వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గుడివాడ రామారావు, కార్యదర్శిగా గొల్లపల్లి రామారావు, ఉప కార్యదర్శిగా పి.రామకృష్ణలు ఎన్నికయ్యారు. డైరక్టర్లుగా మరో ఏడుగుర్ని ఎన్నుకున్నారు. వీరిని సంఘం సభ్యులంతా ఘనంగా సత్కరించారు.

తప్పిపోయిన తల్లీపిల్లల అప్పగింత



తల్లీపిల్లలను కుటుంబసభ్యులకు అప్పగించిన ఎస్సై నీలావతి

రాజాం సిటీ: మండల పరిధి ఇల్లంనాయుడువలస గ్రామానికి చెందిన గంటసాల సుజాత, నాలుగేళ్ల కుమార్తె సంకీర్తన, ఆరు నెలల చిన్నారి సంచరితను కుటుంబసభ్యులకు పోలీసులు బుధవారం అప్పగించారు. ఇందుకు సంబంధించి ఎస్సై పి.నీలావతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 18 నుంచి భార్యాపిల్లలు కనిపించడంలేదని గంటసాల సత్యధర్ 20న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫోన్ నంబర్ ఆధారంగా తల్లీపిల్లలు శ్రీకాకుళం జిల్లా గార మండలం ఆడవరం గ్రామంలో మేనమామ ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అక్కడి పోలీస్ సిబ్బంది సహాయంతో వారిని తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై నీలావతి తెలిపారు.

వంటపాత్రల విషయంలో గొడవ



చికిత్స పొందుతున్న నీలమ్మ

పార్వతీపురం: పాఠశాలలో వంటపాత్రల విషయమై ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఓ మహిళ గాయపడింది. ఈ విషయంపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన ఎం.నీలమ్మ పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. పాఠశాలలో వంటపాత్రలు కన్పించడం లేదని స్కూల్ పక్క ఇంట్లో ఉన్న మరియమ్మను అడిగింది. వంటపాత్రల విషయమై మమ్మల్ని ఎందుకు అడుగుతావు అంటూ మరియమ్మ దుర్భాషలాడి నీలమ్మను పలు చోట్ల గాయపరిచింది. గొడవ జరుగుతున్న సమయంలో వచ్చిన మరియమ్మ బంధువు దొంకాడ చంటి కూడా నీలమ్మను కొట్టి గాయపరిచాడు. దీంతో నీలమ్మ చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేరింది.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	59,670-00
బంగారం(22క్యా. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	76,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹ 270

- ఖరీఫ్‌లో తస్మాత్ జాగ్రత్త
- సీజన్‌లో విషసర్పాల సంచారం ఎక్కువ
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం
- సెప్టెంబరు వరకు బెడద ఎక్కువే

పార్వతీపురం మన్యం జిల్లాలో పాముకాటు మృతుల వివరాలు	
సంవత్సరం	పాముకాటుకు గురైన వారు
2021	15
2022	11
2023లో (ఇప్పటివరకు)	5



పామ్..పామ్.. పాము బాబోయ్...!

సీతంపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఆకుపోతలు, మరికొద్ది రోజుల్లో ఉబాలు ప్రారంభిస్తారు. ఈ సీజన్‌లో విషసర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు గతంలో పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. అలాగే గాయాలపాలైన వారు కూడా ఉన్నారు. ప్రతి ఏటా పాముకాటు బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువవుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఎక్కువగా పొలాల్లో గడుపుతారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈనెల నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర విషకీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

పొలాల గట్ల మీద వెళ్లేటప్పుడు కర్ర చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రి పూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లినప్పుడు టార్చిలైట్ తీసుకువెళ్లాలి. ధాన్యపు గాదెలు, గడ్డివాములు ఉండే చోట ఎలుకలు తిరుగుతాయి. తడిగా ఉంటే కప్పలు చేరతాయి. వాటిని తినడానికి పాములు వస్తాయి. అలాగే తేలు వంటి ప్రమాదకర కీటకాలు ఉండే అవకాశముంది. ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలి. ఎక్కువగా పాములు పొదల్లోనే ఉంటాయి. గోడల పక్కన చేరతాయి. చీకట్లో బయటకు వెళ్తే తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.

పాములు-విషప్రభావం

కట్ల పాము: ఇది కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.
నాగుపాము: ఇది కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది.
రక్తపింజర: ఇది కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది.
జెర్రిపోతు, నీరుకట్ట: ఇవి కాటేసినా విషం ఉండదు. అయినా ఆస్పత్రిలో చికిత్స అవసరం

అన్ని పాములు ప్రమాదకరం కాదు..

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. కట్లపాములే ప్రమాదకరమైన సర్పజాతులు. వీటితోనే ఎక్కువ ప్రమాదం. సాధారణంగా 90 శాతం పాము కాట్లు విషం ప్రమాదం లేని మాములు గాయాలేనని వైద్యులు చెబుతున్నారు. సాధారణ చికిత్స తీసుకుంటే నయమవుతుంది. పాముకాటు కన్నా చాలా మంది షాక్‌తోనే ప్రాణం మీదికి తెచ్చుకుంటారు. ఇంట్లో వారు ధైర్యం చెప్పడానికి బదులు ఏడవడం వల్ల బాధితుడు భయాందోళనకు గురైతే పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. మన ప్రాంతాల్లో సంచరించే పాముల్లో నాగుపాము, తాచు, కట్లు, రక్తపింజరి రకాలు ప్రమాదకరమైనవి. ఇవి కరిస్తే రెప్పలు వాలిపోవడం, మింగుడు పడకపోవడం, కాళ్లుచేతులు నీరసం అయిపోవడం, ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. కిడ్నీలపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. పాముకాటు బాధితులకు ఏఎస్‌వీ వ్యాక్సిన్ వేయాలి. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటిలేటర్‌పై శ్వాస అందించాలి.

ఇలా చేయకూడదు..

పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తి, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయవద్దు. ఒక్కోసారి పాముకాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారవచ్చు. సాధ్యమైనంత త్వరగా శాస్త్రీయమైన చికిత్స అందించడమే ఉత్తమం. మరికొందరు పాము కరిచిన ప్రదేశంలో గాటు పెట్టి నోటితో విషం పీల్చేస్తామంటారు. పాముకాటు వేయగానే విషం రక్తంలో ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు, గుండెకు చేరుకుంటుంది. కాబట్టి దీనివల్ల ప్రయోజనం ఉండదు. ఒక్కోసారి హాని కలగవచ్చు.

వెంటనే ఆస్పత్రిలో చేర్చాలి

పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ప్రథమ చికిత్సలో భాగంగా పాము కాటు వేసిన చోట కట్టు వేయాలి. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

- కాటు వేసిన ప్రదేశంలో పాము కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

అందుబాటులో ఏఎస్‌వీ ఇంజక్షన్లు



పాము కాటు బాధితులకు ఏఎస్‌వీ ఇంజక్షన్లు అన్ని ప్రాథమిక కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పాము కరిచిన వెంటనే ఏదైనా వాహనంలో ఆరోగ్యకేంద్రానికి చేర్చాలి. నడిపించకూడదు. విషపూరితమైన పాములు మన ప్రాంతంలో తక్కువగా ఉన్నాయి. పాము కరిచిన చోట ఒకటి లేదా రెండు గాట్లు ఉంటే అది విషపూరితంగా గుర్తించాలి. అంతకంటే ఎక్కువగాట్లు ఉంటే విషరహిత పాములుగా గుర్తించాలి. విషపూరిత పాము కరిస్తే వెంటనే రక్తం వస్తుంది. ఆరు గంటలవరకు ప్రమాదం లేదు. వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలి.
విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, సీతంపేట

సాయన్నచానల్‌ను ఆధునికీకరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహన రావు

- కలెక్టర్‌కు జెడ్పీ వైస్‌చైర్మన్ వినతి

సంతకవిటి: మండలంలోని మాధవరాయపురం నుంచి వాల్తేరు వరకూ విస్తరించి ఉన్న సాయన్న చానల్ పూడికలు, రెల్లిగడ్డితో నిండిపోయిందని, ఆధునికీకరణ పనులు చేయించాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు కలెక్టర్ నాగలక్ష్మిని కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. సాయన్నకాలువ పరిధిలో 8 వేల ఎకరాల ఆయకట్టు ఉందని, ప్రతి ఏడాది ముంపు వస్తోందని పేర్కొన్నారు. కాలువ ఆధునికీకరణతో పాటు మదుములు ఏర్పాటుచేయాలని కోరారు. అలాగే వాసుదేవపట్నం ప్రభుత్వ కేజీబీవీలో విద్యార్థినులకు సీట్ల సంఖ్య పెంచాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ ఆయనకు హామీ ఇచ్చారు.

పైడితల్లి ఆలయ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మకర్తల మండలి చైర్మన్ అశోక్ గజపతిరాజు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ధర్మకర్తల మండలి, భక్తులు విశేష కృషి చేయాలని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కోరారు. ఈ మేరకు స్థానిక అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో బుధవారం ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయనతో పాటు సభ్యులు మాట్లాడుతూ చదురుగుడి అభివృద్ధికి గాను ఇప్పటికే ఎదురుగా ఉన్న ఎడ్వర్డ్ ఆస్పత్రి స్థలాన్ని వర్తకులకు అందజేశామని, త్వరలోనే ఆలయం ఇరువైపులా ఉన్న షాపులను నేలమట్టం చేసి, చదునుచేసి, స్థలాన్ని సిద్ధం చేయాలని తీర్మానించారు. వీటితో పాటు ఇంకా మిగిలిన సిటీస్కాన్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రాసెస్ కోసం దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫైల్ పంపేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అదేవిధంగా కేఎల్ పురం వద్ద దాత ఇచ్చిన సుమారు 251 గజాల స్థలాన్ని 11 ఏళ్లపాటు ఓపెన్ ఆక్షన్‌లో లీజుకు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు శతశాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోండి

- డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి



సమీక్షా సమావేశంలో మట్లాడుతున్న డీఈఓ లింగేశ్వర రెడ్డి



హాజరైన నాలుగు మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు

బొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థి స్కూల్‌కు ప్రతిరోజూ వచ్చేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం, మెంటాడ మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారందరినీ స్కూల్స్‌లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. రెండో విడత నాడు నేడు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించి పనులు పూర్తి చేయాలని చెప్పారు. జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే పూర్తిస్థాయిలో అన్ని స్కూళ్లకు సరఫరా అయ్యాయని, విద్యార్థులకు పంపిణీ శతశాతం పంపిణీ పూర్తి కావాలని కోరారు. ప్రతిరోజు ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనాలను పరిశీలించడంతో పాటు నాసిరకంగా పెట్టకుండా ఎక్కడా ఫిర్యాదులు రాకుండా విద్యార్థులకు భోజనాలను మెనూ ప్రకారం పెట్టాలని చెప్పారు. 10 వతరగతి ఉత్తీర్ణులు కాని విద్యార్థులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు, ఎంపీడీఓ వైవీ రాజేంద్ర ప్రసాద్ నాలుగు మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించాలి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: ప్రాథమిక దశలో చిన్నారులకు చక్కని విద్యతో పాటు పౌష్టికాహారం సక్రమంగా అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో గిరిజన ప్రాంత పరిధిలో శిశు సంక్షేమశాఖ ద్వారా అమలు జరుగుతున్న పథకాల అమలుపై ఐసీడీఎస్ పాజెక్టు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా అమలు చేస్తున్న పథకాలు, లబ్ధిదారుల వివరాలను సమీక్షించారు. గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ అభియాన్ ద్వారా అందిస్తున్న పాలు, పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలో బరువు తక్కువ ఉన్న చిన్నారులు, రక్త హీనత కలిగిన గర్భిణులు, బాలింతల వివరాలను నమోదు చేయాలని, వారికి పౌష్టికాహారం, మందులు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె.విజయగౌరి, ఐసీడీఎస్ పీఓలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

నెల్లిమర్ల: పట్టణంలోని జూట్‌మిల్లు సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ బుధవారం మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు చెప్పారు. మృతురాలి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని, నీలం, నలుపు రంగు డిజైన్ గల పంజాబీ డ్రెస్, ఎరుపు రంగు చున్నీ వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 7013273731 నంబరుకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్టు

బొబ్బిలి: పట్టణంలోని ఎరుకలి వీధి మద్యం షాపు నుంచి 20 మద్యం సీసాలను తరలిస్తుండగా మండలంలోని కోమటిపల్లికి చెందిన మంతెన సత్యవతిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు. ఆమె వద్ద ఉన్న 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

బైక్‌ను ఢీకొన్న ట్యాంకర్: ఇద్దరికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండలంలోని చందక పేట జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని ఓ ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సాలూరుకు చెందిన కానూరి లక్ష్మి, కానూరి శంకర్రావులు సాలూరు నుంచి విజయనగరం ద్విచక్ర వాహనంపై వస్తుండగా విజయనగరం నుంచి రాయగడ వెళ్తున్న ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడగా ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో విజయనగరంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఎస్.రవి పరిశీలించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

బైక్‌ను లారీ ఢీకొని మరో ఇద్దరికి..

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని వస్త్రపు రికాలనీ వద్ద బుధవారం జరిగిన బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారని సీఐ కె.రవికుమార్ తెలిపారు. తెర్లాం మండలం అప్పలంపేట గ్రామానికి చెందిన చిన్నప్పడు, ఆదినారాయణలు ద్విచక్రవాహనంపై రాజాం వస్తుండగా రాజాం నుంచి తెర్లాం వెళ్తున్న లారీ ఢీకొనడంతో గాయాలపాలయ్యార న్నారు. వెంటనే స్థానికులు 108 సహాయంతో రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వారిద్దరినీ తరలించగా చికిత్స పొందారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



బోల్తాపడిన ట్యాంకర్, నుజ్జునుజ్జయిన మోటార్ సైకిల్

సంస్కృత కళాశాలలో ప్రవేశాలకు సహాయకేంద్రం

విజయనగరం టౌన్: డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాలకు మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో సహాయకేంద్రం ఏర్పాటు చేసినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.గౌరీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వివిధ కోర్సులలో ప్రవేశాలు పొందే విద్యార్థులకు ఎదురయ్యే సందేహాల నివృత్తికి, సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి ఈ సహాయకేంద్రం ఉపయోగపడుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7306980890, 9948883817 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మూడు మండలాలకు ఒక ఏడబ్ల్యూవో

- జీసీ, సోషల్‌వెల్ఫేర్, గిరిజన ఆశ్రమపాఠశాల తనిఖీ
- జీవో నంబర్ 37 విడుదల

సంక్షేమ పాఠశాలలు ఇలా..		
సంక్షేమ శాఖ	పాఠశాలలు	విద్యార్థులు
బీసీ వెల్ఫేర్ పాఠశాలలు	19	579
సోషల్ వెల్ఫేర్	17	363
సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్	5	2545
గిరిజన సంక్షేమ ఆశ్రమాలు	77	19,317
గిరిజన గురుకులాలు	23	6808



సామరెల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల

సీతంపేట: నూతన విద్యాసంస్కరణలతో ప్రభుత్వం ముందుకు దూసుకు పోతోంది. వివిధ సంక్షేమశాఖల పరిధిలో పనిచేస్తున్న పాఠశాలలను పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఒకే గొడుకు కిందికి తీసుకురానుంది. దీనిలో భాగంగా తాజాగా జీవో నంబర్ 37ను ఇటీవల విడుదల చేసింది. మూడు మండలాల ఫంక్షనల్ ఇంటిగ్రేషన్‌తో కూడిన వ్యవస్థను అమలు చేయనుంది. బీసీ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలన్నింటిని పర్యవేక్షించడానికి ఆయా సంక్షేమ శాఖల్లో ఇప్పటికే పనిచేస్తున్న సహాయ అధికారులను అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు (ఏడబ్ల్యూవో)ల పేరుతో పిలుస్తారు. ఒక్కో అధికారి మూడు మండలాల్లో ఉన్న అన్ని రకాల సంక్షేమ పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థుల యోగక్షేమాలను తెలుసుకుంటారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం, లోటుపాట్లు సరిదిద్దడం, మౌలికవసతులు తదితర అంశాలన్నీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. జిల్లాలో 141 వెల్ఫేర్ పాఠశాలల్లో 29,613 మంది విద్యార్థులు చదువుతున్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సేవలను అందించడానికి తీసుకువచ్చిన ఈ వ్యవస్థ త్వరలోనే అమలుకానుంది.

వెల్ఫేర్ ఆఫీసర్ల పునర్వ్యవస్థీకరణ..

జిల్లా స్థాయిలో బీసీ, సోషల్‌వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయాల పరిధిలో ఇప్పటికే పనిచేస్తున్న అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లకు పోస్టులు కేటాయించనున్నారు. రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా జిల్లా పరిధిలో మూడు మండలాలకు ఒక ఏడబ్ల్యూవోను నియమించేలా ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పెట్టనున్నారు. కలెక్టర్‌తో పాటు హెచ్‌వోడీలు కమిటీలుగా ఏర్పడి ఆయా మండలాలకు ఏడబ్ల్యూవోలను కేటాయిస్తారు.

త్వరలోనే అమలు



జీవో నంబర్ 37 త్వరలో అమలు కానుంది. ఈమేరకు ఉత్తర్వులు వచ్చాయి. అన్ని సంక్షేమ ఆశ్రమపాఠశాలలను ఇకపై ఏడబ్ల్యూవోలు పూర్తి స్థాయిలో పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పనిచేస్తున్నారు. వీరే ఇకపై ఏడబ్ల్యూవోగా మారనున్నారు. ఏ సంక్షేమ పాఠశాలలనైనా వారికి కేటాయించిన మండలాల్లో పర్యవేక్షించనున్నారు. శ్రీనివాసరావు,
గిరిజన సంక్షేమశాఖ డీడీ, సీతంపేట ఐటీడీఏ

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE
■ New Flat For Sale 1st Floor North, Lift, Generetor, parking, Opp Kusumaharanath Temple, Nellimarla Road, Poolbaugh. 9490874327, 9490560262. [S- 1195710]

BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034424384 [H-189201]

WANTED
■ Hostel Wardens Male / Female (Qly:Any Degree) & PET (M/F) (Qly: B.P.Ed/D.P.Ed) Cont: 6300325783, 8886663000, 9640457222. [S-1195709]

■ హైదరాబాదులో ఉద్యోగ అవకాశాలు M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం 16-18 వేలు భోజన వసతి ఇన్సూరెన్స్ సౌకర్యం కలవు. ఆసక్తి కలవారు కింది నెంబర్‌కి కాల్ చేయండి. +916300813664 [G-815]

■ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో వర్క్ చేస్తూ నెలకు 35,000/- వరకు సంపాదించవచ్చు. 100% ఎటువంటి ఫీజులు ఉండవు. పార్ట్ / ఫుల్ టైం. ఫోన్: 89784 98206 [V- 794648]

■ నెల్లూరు నందు రెస్టారెంట్‌లో హౌస్ కీపింగ్ పనులు చేయుటకు బాయ్స్ కావలెను. 8 గం॥ డ్యూటీ - 12వేలు జీతం (రూం, భోజనం ఫ్రీ) Contact: Mega Group. 7093125169. [NA-5701]

■ మా సంస్థను మీ జిల్లాలో అభివృద్ధి చేయుటకు మార్కెటింగ్ ఫీల్డ్‌లో అనుభవమున్న వారు కావలెను. Mega Group Manpower & Security. Cell : 70826 10569, 70931 25169. [NA-5711]

■ లేపాక్షి హెల్త్ కేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K. ఏజెంట్ కమీషన్ 6K ఫోన్ : 9640400073. [HA-294]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీ/పు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్‌బాయ్స్, నర్సులు, వంటవారు.RMP. Dr. Q:5th- Degree, 10-30 వేలు జీతం, భోజనం+రూం ఫ్రీ, Hyd. 7993583999 [HA-308]

■ భారత్ బ్యాంకులో టెలీకాలర్స్‌గా పనిచేయుటకు తెలుగులో ధారాళంగా మాట్లాడగల 10వ తరగతి చదివిన 23సం॥ లోపు యువతీలు కావలెను. ఫోన్: 98855 52945 [V-794567]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.